# మనసు మందారం

సూర్యుడు తిరుగు ప్రయాణం మొదలెట్టి చాలాసేపయింది. కొండల దిగువన నీరెండ పరచుకుంటోంది.

రచ్చబండమీద కూచుని తాపీగా చుట్ట కాలుస్తున్నాడు నారాయణ. రచ్చబండ మధ్యగా పెద్ద వేపచెట్టు; దానిపైన వీరబ్రహ్మంగారి కావి జండా. అది గాలికి రెపరెపలాడుతోంది.

ఎదురుగా వున్న దృశ్యంవంక పారవశ్యంతో చూస్తున్నాడు, నారాయణ.

రోడ్డు కవతల చిన్న చిన్న గుట్టలూ, వాటికి కొంచెం పక్కగా పెద్ద కొండా; దూరంగా చెట్లూ; ఆకాశంలో తేలిపోతున్న మబ్బులూ.

పొగవదిలి, చూపుని ఎడమవైపు మరల్చాడు, నారాయణ.

ఊళ్ళోనుంచీ 'హైవే'కేసి పరచుకున్న తార్రోడ్డు ఆ రోడ్డువారగా బారులుతీరిన ట్యూబ్‌లైట్ స్తంభాలు.

'ఈ ఊరు నాది' అనే భావన ఎప్పుడూ నారాయణ మనసుని చిందులు వేయిస్తుంది; 'ఈ ఊరు నాది' అనిపిస్తే చాలు — మనసంతా మంచుతో తడిసినట్లవుతుంది నారాయణకి. 'ఈ ఊరు నాది' అనుకోగానే — గున్న ఏనుగు నెక్కి జండాకర్ర పట్టుకున్న అనుభూతి కలుగుతుంది నారాయణకి.

అవును. పాతికేళ్ళు ప్రెసిడెంటుగిరీ చేశాడు. ఊళ్లోకి రోడ్డు వచ్చింది; కరెంట్ వచ్చింది; నీటి కుళాయిలు వచ్చినై; బస్ సౌకర్యమూ సాధించాడు.

ఆ తర్వాత,

జనానికి నాగరీకం బలిసింది. సినిమాహాల్ వచ్చింది. రాజకీయాలొచ్చినై. పార్టీలొచ్చినై. కక్షలూ, కావేషాలూ వచ్చినై. వర్గాలూ వర్ణాలూ వచ్చినై. ఇప్పుడు — ఏ రెండు తలలూ కలిసిరావు; ఏ ఇద్దరి తలపులూ ఒనగూడవు. 'నీతో మాట్లాడతాను — నాకేమిస్తావ్; నాతో మాట్లాడటానికి ఏం తెస్తావ్' — తీరుగా తయారైనారు జనం. ఊళ్ళో అందరూ, అన్నివేళలా 'బిజీ'గా తిరుగుతూ వుంటారు. రోజూ పట్నం పోయొస్తారు. ఆ పనులేఁవిటో, ఆ వ్యవహారాలేఁవిటో — ఏఁవీ అంతుపట్టవు. ఒకప్పుడు —

ఈవేళలో—రచ్చబండమీద చాలామంది వుండేవాళ్ళు. మంచీ చెడూ మాట్లాడుకుంటూ వుండేవాళ్ళు ; కష్టసుఖాలు కలబోసుకుంటూ వుండేవాళ్ళు. ఇప్పుడు తానొక్కడే నిత్యం వచ్చే మనిషి. కాకుంటే, ఆ మూల చెరువుకట్టకింద—తత్వాలు పాడుకొనే రామదాసు కనిపిస్తాడు.

మొన్న—

ఇదే సమయంలో—

ఊళ్ళోకి బిలబిలమంటూ యాభై అరవైమంది మనుషులు—ఉన్నట్టుండి ఊడిపడ్డారు. ముక్కూ, మొహం తెలీదు. ఆరు కిలోమీటర్ల అవతల 'బోగి'లు పట్టాలు తప్పి రైలాగిపోయిందిట. ఆ రాత్రికి పోదని చెప్పారుట. కాళ్ళీడ్చుకుంటూ వచ్చారు. అంతా ఆకలితో నకనకలాడు తున్నారు. ముసలీ ముతకా ; ఆడవాళ్ళూ పిల్లలూ అయితే-మరీ ప్రాణాలు కళ్ళల్లో పెట్టుకున్నట్టు కనిపించారు.

ఊళ్ళో "పెద్దలు"—ఎవరూ అతీ గతీ లేరు. తనే పూనుకున్నాడు. క్షణాల్లో రాళ్ళ పొయ్యిలు లేచిన్నై. వంటా వార్పూ అయింది. నలుగురూ నాలుగు ముద్దలు తిని నీళ్ళు తాగారు.

అదిగో, అప్పుడొచ్చారు — పెద్దలు. నరంలేని నాలుక నానారకాలుగా సాగింది. తానేదో పేరు కోసం, బిరుదుకోసం — వాళ్ళందరికీ వండి వార్చించాడని—వంకర

మాటలు మొదలెట్టారు. సమయానికి గోపాలం ఉగ్రుడై మాటకు మాటా చెప్పబట్టి, తోకముడుచుకుని వెనక్కి తగ్గారు.

ప్రయాణీకులంతా రాత్రి పదింటికి తిరుగు ప్రయాణం మొదలెట్టారు. వాళ్ళల్లో వో అవ్వ — వెళ్తూవెళ్తూ తన దగ్గరగా వచ్చింది. కళ్ళల్లోకి చూస్తూ, సంతృప్తిగా అన్నది, "అన్నదాతా సుఖీ భవ". ఆ వెంటనే రొంటిలో నుంచీ వో నాణెం తీసి తన చేతిలో వుంచింది. "లక్ష్మీదేవి నీ యింట్లో ఎప్పుడూ ఆడుకుంటూనే వుండాల" అని దీవించింది. తీరాచూస్తే, ఆ నాణెం — లక్ష్మీదేవి రూపు! తానూ, భార్యా, గోపాలమూ — ఆశ్చర్యంతో వొకరి మొహాలొకరు చూసుకున్నారు. తన భార్య, శారద అన్నది, 'రాబోయే కోడలుకి జాగ్రత్త చేద్దాం' అని.

"తోటలో చీనీ పళ్లకి కాళ్లొచ్చినై. ఇట్టాగే చూస్తా కూచుంటే, ఏకంగా తోటనే ఇంటికి తోలించుకుంటారు" ధూముధాముగా వచ్చాడు, గోపాలం.

నారాయణ కొడుకువైపు సాలోచనగా చూశాడు.

పాతికేళ్ల యవ్వనం తెచ్చిన ఆరోగ్యం, ఉత్సాహం, ఊపూ, ఉద్రేకం—కనపడుతున్నై, గోపాలం మాటల్లో.

ఏ ఆత్రుతా, ఆందోళనా లేవు—నారాయణలో.

"నే చెప్పేది విన్నావా?" అంటూ పక్కగా కూచున్నాడు గోపాలం.

"విన్నాలేరా. ఎందుకంత కంగారు? ఏవో నాలుగు పళ్ళు తింటానికి కోసుకుపోయుంటారు. పోనీ మనకున్నవి చాల్లే". తాపీగా అని చుట్టపొగ పీల్చేడు, నారాయణ.

"ఎవరో తెలుసా ?"

"ఎవరయితేనేంలే—పోనిద్దూ"

నుదురు కొట్టుకున్నాడు గోపాలం. "నా చిన్నప్పుడే ఉన్నదంతా ఊడ్చి మీ అన్న కిచ్చేశావ్...."

గోపాలం ఇంకా ఏదో అనబోయాడుగానీ, నారాయణ కంఠం ఖంగున మ్రోగింది, "గోపాలం!"

"ఆఁ....మళ్ళీ ఆ మాటలు రాకూడదు...." గునుస్తూ పక్కకి తిరిగేడు గోపాలం.

నారాయణ కళ్ళముందు ఆ దృశ్యం కదలాడింది. తండ్రి పోగానే ఆస్థి పంపకానికి పేచీ పెట్టాడు రంగస్వామి. తనకూ శారదకూ కూడా ఇష్టంలేదు. రంగస్వామి పట్టుదలకి కారణం—తనది "దుబారా చెయ్యి" అనే. సరే. జరగాల్సింది జరక్క తప్పలేదు. పెద్దమనుషులముందు వ్యవహారం రంగంలో కొచ్చింది. తీరా అన్నీ పరిష్కార మైనాయనుకుంటున్న సమయంలో, రంగస్వామి ఉన్నట్టుండి కొత్త కోరికని లేవనెత్తాడు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసినప్పుడు తను చాలా కోల్పోయాననీ, ఆ కారణంగా, జ్యేష్ట భాగం క్రింద తనకు మరి కొంత రావాలనీ. తనకు

చిరాకేసింది. మాటా మాటా అనుకున్నారు. కోపంతో, ఆ చిరాకులో— "నాకు ఈ ఆస్థిలో భాగమే వద్దు. మొత్తం ఆయన్నే తీసుకోమను." అని కదిలిపోయాడు తను. అంతే. ఆ తర్వాత ఎవరెన్ని చెప్పినా తన నిర్ణయం మార్చుకోలేదు. పెద్దమనుషుల బలవంతాన మిద్దెని మాత్రం తన క్రింద వుంచుకున్నాడు. ఆ తర్వాత —

తనకూ. శారదకూ, నారాయణకూ — మసక వెలుగే ప్రసన్నంగా తయారైంది. శారద పసుపు కుంకుమ క్రింద పట్టుకొచ్చిన ఐదెకరాలే—తమ కష్టాన్ని దక్కించుకున్నై. ఫలితం — శ్రమ శక్తిమీద ఆధారపడే వుంది కనుక, తను ఇవ్వాళ ఇంతవాడయ్యాడు. 'మంచి మనిషికి మంచి రోజులు'—అంటూ వుంటాడు, రామదాసు.

" ఊళ్ళోవాళ్లకి వుపకారాల్తోనే సరిపోతోంది. "

గోపాలం మాటలతో ప్రస్తుతంలోకి వచ్చాడు, నారాయణ. " కాచిన చెట్టుకి రాళ్లదెబ్బలు తప్పవులేరా " అని సన్నగా నవ్వాడు. చుట్టపొగని నిండుగా పీల్చి వదిలాడు.

నారాయణకి తెలుసు — బహుశా, చంద్రాయుడి పిల్లలు తోటలోకి వచ్చి వుంటారు. చంద్రాయుడు దొంగతనం చేయించడు. ఆ పిల్లలైనా తమ పాలేరు రంగయ్యకు చెప్పే వుంటారు. రంగయ్యకేమో తన మనసు తెలుసు. కాకుంటే, చంద్రాయుడుకీ తమకూ వైరం వున్నట్టు

గోపాలానికి తెలుసు. కనుక, అతని పిల్లలు తోటలో కాలు పెట్టే—కోపమొస్తుంది, గోపాలంకి.

రాయుడు — ఎలక్షన్‌లో — గట్టి రాజకీయమే ఆడాడు. "మన ఊళ్లో పార్టీలూ, కక్షలూ వద్దు" అని సలహా యిచ్చాడు తను. చంద్రాయుడు వినలేదు. పైగా, "నీ అన్న కొడుక్కు వత్తాసుకోసం—ఇలాంటి సలహా యిస్తున్నా"వని మండిపడ్డాడు. నిజానికి, తనకు అసలు సంగతి తెలీనే తెలీదు. చంద్రాయుడూ, తన అన్నకొడుకు వెంకటసుబ్బయ్యా ప్రత్యర్థులనే విషయం ఆ తర్వాతగానీ తనకు తెలియలేదు. అదిగో, అప్పట్నుంచీ చంద్రాయుడికి తనంటే సరిపడదు. దానికితోడు ఎన్నికల్లో అతని ఓటమి వలన—తనపట్ల చంద్రాయుడికి కోపం ఇంకా ఎక్కువైంది.

ఆలోచనల్లోనుంచీ తేరుకుని, "నువ్ పోయిరా" అన్నాడు, నారాయణ.

తండ్రి ఇంకేమీ చెప్పడని తెలుసు గోపాలంకి. సురసుర చూపుల్తో కదిలేడు. కాళ్లు తాటించుకుంటూ వెళ్ళిపోయాడు.

గోపాలం వెనగ్గా వచ్చాడు, రంగయ్య. నల్లగా వొడ్డూ పొడుగూ మనిషి. నీర్కావి కట్టుపంచె భుజంమీద పైపంచె. చేతిలో కర్ర.

"రా....రంగయ్యా. ఏఁవిటి విశేషాలు ?" అడిగేడు నారాయణ. కొద్దిసేపు తటపటాయించి చెప్పాడు, రంగయ్య. "ఇయ్యాల... తోటలోకి రాయుడుగారి పిల్లలొచ్చారండి".

"....సరి సరి....ఆ సంగతి సరేలే. వేరే ఏంవున్నయ్" అని ఆ ప్రసక్తిని దాటేశాడు నారాయణ.

కొద్దిసేపు పొలం కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు రంగయ్య.

♦ ♦ ♦

ఆ రాత్రి—

చాలాసేపు భార్యతో ఒకే విషయం గురించి చర్చించాడు, నారాయణ. నారాయణ నిర్ణయానికి ఆశ్చర్యపోయింది, శారద. భర్తపట్ల తనకున్న గౌరవం భక్తీ, ఆరాధనా—అన్నీ మరోసారి ఇనుమడించినై, ఆమె మనస్సులో.

మర్నాడు—

మధ్యాహ్నం,

చంద్రాయుడి ఇంటికి వెళ్ళాడు నారాయణ. అదిరి పడ్డాడు రాయుడు. ఉరుమూ మెరపూ లేకుండా ఊడిపడిన వర్షంలా వచ్చాడేమా నారాయణ అని ఆశ్చర్యపోయాడు.

మొహంమీద నవ్వుని పులుముకుని, ఆహ్వానించాడు. కాఫీ టిఫిన్లు అయినై.

రాయుడి మనస్సు పరిపరివిధాల పోతోంది. క్రితం సారి—ఎన్నికలప్పుడు—జరిగిన సంఘటనలే అతని కళ్ళముందు కదుల్తున్నై. వెంకటసుబ్బయ్యని తనమీద పోటీకి నిలిపింది నారాయణే అని తన నమ్మకం. పైకి

"మన ఊళ్ళో పార్టీలూ, పోటీలూ వద్దు" అని చెప్తూ అన్నకొడుక్కి పెత్తనం యివ్వాలని నారాయణ ఎత్తుగడ అనీ తన కనిపించింది. అందుకే, ఎవరెన్ని చెప్పినా తాను పోటీనుంచీ విరమించుకోలేదు. నారాయణతోనూ నిష్కర్షగా చెప్పాడు, "మీకు పదవిమీద ఏ ఆశా లేదన్నారు గదా. మేమూ మేమూ తేల్చుకుంటాం. మీరు ఎటూ సపోర్ట్ చేయకండి" అని. కానీ, నారాయణ తటస్థంగా వూరుకున్నాడా ? ఊరుకున్నాడనే ఊళ్ళో కొంతమంది అన్నారు. కానీ....కానీ తను ఎన్నికల్లో ఓడిపోయాడు. నారాయణ వత్తాసు లేకుండా వెంకటసుబ్బయ్య గెలవ గలడా ? ఇదీ తన ప్రశ్న. అందుకనే—నారాయణంటే తనకు వైముఖ్యం, వైరం కలిగినై. ఆయన "చెప్పేదొకటీ, చేసేదొకటీ" అనే నిర్ణయానికి వచ్చాడు తను.

గది గుమ్మంవారగా నిలబడ్డ రాయుడి భార్యని పలకరించాడు నారాయణ, "ఏం చంద్రమ్మా అంతా బాగున్నారు గదా" అంటూ. "ఆ" అని సమాధానం చెప్పింది చంద్రమ్మ.

రాయుడు ఈ లోకంలో కొచ్చాడు. రాయుడికేసి చూస్తూ, సరాసరి విషయంలో కొచ్చాడు, నారాయణ. "మా గోపాలం సురసురలాడుతున్నాడు రాయుడూ, తొందరగా లగ్గం పెట్టించమని చెప్పిపోవడానికే వచ్చాను" అన్నాడు.

రాయుడు ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు. చంద్రమ్మా విస్తుపోయి చూసింది. కళ్లు మిలమిలలాడిస్తూ నారాయణకేసి చూశాడు, రాయుడు.

"ఏం—అంతగా ఆశ్చర్యపోతున్నావ్. నిజంవే. రాధమ్మ ఇహ మా ఇంటి పిల్లే".

తెప్పరిల్లుకుని పెదవులు తడిచేసుకున్నాడు, రాయుడు.

"ఈ విషయంలోనన్నా నా మాట వినమని చెప్పు చెల్లెమ్మా—మీ ఆయనకి" అన్నాడు, నారాయణ—చంద్రమ్మని వుద్దేశించి.

కృతజ్ఞత వర్షించే కళ్ళతో చూశాడు, రాయుడు.

♦ ♦ ♦

రాత్రి—

అన్నాల దగ్గర కొడుక్కి ఈ విషయం చెప్పింది, శారద.

గోపాలంకి మతిపోయినట్లైంది. రాయుడికీ తమకూ వైరం ? తమకూ ఆయనకూ మధ్య, వాళ్ళ దృష్టిలోవున్న అగాధమంత అంతస్థు ? ఎన్నో ప్రశ్నలు !

అందుకే, రాధ అంటే ఇష్టమే అయినా, ఆమెను తాను ప్రేమిస్తున్నా, ఆ మాట అంటే అటు రాయుడూ, ఇటు తన తండ్రీ—తమ తలలు ఛెక్కేస్తారనే భయంతో ఆ ఆశని పైకి రానీయలేదు. అయినా,

తమవి—ఏకులబుట్టలో తొక్కిపెట్టిన భావాలు కావూ? ఏఁవో మరి :

గోపాలం అనేక భావాల మధ్య ఆలోచనల పావురాళ్ళతో వెన్నెట్లో ఆడుకుంటున్నాడు.

తనంతట తానే తండ్రి ఇలా మిఠాయి పొట్లం చేతికిచ్చి ఆనందపరచడం? —

ఏఁవిటో—ఏఁవీ అర్థంకాలేదు, గోపాలంకి.

"ఈ కాలపు కుర్రసన్నాసులకి దేనికీ ధైర్యం చాలదు. లో పిరికీ, ఎలిపిరికీ. ఈ అంతస్థులూ, వైషమ్యాలూ, వైరాలూ—అసలైవ అంతఃకరణలూ వేరని అనుకోరు." అని చుట్ట వెలిగించుకున్నాడు, నారాయణ.

"మాటకు ముందు భేషజం, అతిశయం, ఆర్భాటం, మేకపోతు గాంభీర్యం. మనసులో మాత్రం ఏముంటుందో ఏమో—ఏఁవీ తెలీదు. ఈ ముసలాళ్ళతో ఇదే అవస్థ." అని మంచంలో ఇటూ అటూ మసల్తి, అంతలోనే — రాధ ఆలోచనల్లో దూరేడు, గోపాలం :

లక్ష్మీదేవి రూపుని కళ్ళకద్దుకుంటోంది, శారద :